క్లుప్తంగా

అక్షతల పంపిణీ



ఏలేశ్వరంలో అక్షింతలను ఊరేగిస్తున్న మహిళలు

ఏలేశ్వరం: అయోధ్య రామయ్య అక్షతలు పట్టణంలో మంగళవారం వితరణ చేశారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో భద్రపరిచిన అక్షతలను పాతబస్టాండ్ వద్ద వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మేళాతాళాలతో పట్టణంలో ఊరేగించారు. స్థానిక మెయిన్‌రోడ్ బాలాజీచౌక్, హనుమాన్‌జంక్షన్ మీదుగా వందలాది మందితో ఊరేగింపుగా వచ్చి అక్షతలను భక్తులకు అందజేశారు. రామ ఆలయ క్యాలెండర్, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి కటకం కిరిటి, ఏడీపీ ప్రసాద్ మహిళలు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మేనేజర్ రామన్న

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్‌ను మంగళవారం డిపో మేనేజర్ యు.రామన్న ఆవిష్కరించారు. ఏర్పాటు కేక్‌ను కట్ చేసి ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొని స్వీట్స్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పాజీ, పైడిమళ్ల లక్ష్మణ్, ప్రగడ ప్రసాద్, అక్కిరెడ్డి కృష్ణ, వెంకటేశ్ పలువురు ఉన్నారు.

ప్రజల అభివృద్ధికి కృషి

కిర్లంపూడి: ప్రజల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి చేస్తున్నాయని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని బూరుగుపూడి, పాలెం గ్రామాల్లో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బడే రాజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమిష్టి కృషితో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు కొత్త పథకాలకు అర్హులైన లబ్దిదారుల వివరాల నమోదు లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించామన్నారు. అనంతరం డ్రోన్ స్ప్రై యంత్రం పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాలంశెట్టి కృష్ణమూర్తి, ఆళవు భద్రి భాజాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంబాలా వెంకటేశ్వరావు, జగ్గంపేట కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు, ఈఓపీర్డీ ఇ.మార్కండేశ్వరరావు, ఏఓ జోకా అమృత పలువురు ఉన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

గోకవరం: పేకాట ఆడుతున్న ఆరుగురి వ్యక్తులను సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేసినట్టు ఎస్సై శివనాగబాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోకవరం ఊరి శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో మాటు వేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.23140 నగదు, రెండు ప్లేకార్డుల సెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అన్నసమారాధన

జగ్గంపేట: స్థానిక శెట్టిబలిజపేట శివారులో ఉన్న ధన సత్తమ్మ అమ్మవారి ఆలయం వద్ద సంగిరెడ్డి గన్నియ్య, వీర్రాజు దంపతుల ఆర్థిక సహాయంతో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. వైబోగుల కొండబాబు, తాతిని విజయ్, పాలిక వీరబాబు, సిమ్మ ముత్యాలు, దుర్గ ప్రసాద్, కాకినాడ శ్రీను, కొత్త వెంకటేష్, ఆయిల్ స్వామి, కొప్పు అర్జున్, గుర్రయ్య తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

అంగన్‌వాడీల ఆందోళన

ఏలేశ్వరం: తమ డిమాండ్లు పరిష్కారించాలని కోరుతూ పట్టణంలో మంగళవారం అంగన్‌వాడీల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ స్థానిక సచివాలయాల వద్ద ఆందోళన చేశారు. తమ సమస్యలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లాకార్యదర్శి ఏగుపాటి అర్జునరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రాజెక్టు అధ్యక్షురాలు కెసునీత, అమలావతి, వెంకటలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

కొత్తపల్లి: భర్తతో గొడవపడి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఒక మహిళ మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరగిరి గ్రామానికి చెందిన నక్కా విజయలక్ష్మి(38) మంగళవారం ఉదయం తన భర్త మాధవకృష్ణతో గొడవపడింది. దీంతో ఆమె మనస్థాపానికి గురై పురుగుల మందు తాగడంతో అస్వస్థకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భవిత బంగారుమయం

- దివ్యాంగ చిన్నారుల కోసం భవిత కేంద్రం ఏర్పాటు
- ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు

రౌతులపూడి: శారీరకంగా, మానసికంగా పుట్టుకతో దివ్యాంగులైన చిన్నారులకు భవిత కేంద్రం అండగా నిలుస్తోంది. చీకటిలో ఉన్న వారి భవితను బంగారుమయం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ భవిత కేంద్రాలు వారికి ఎంతగానో తోడ్పాటునందిస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు అందరితో సమానం జీవించేలా భరోసానిస్తున్నాయి.

భవిత కేంద్రాల్లో శిక్షణ ఇలా..

మండల కేంద్రమైన రౌతులపూడిలో ఎనిమిదేళ్ల క్రితం దివ్యాంగు చిన్నాల విద్యాబుద్ధులు నేర్పేందుకు భవిత కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రత్యేక అవసరాలు గల 22 మంది చిన్నారులకు సోమవారం నుంచి శుక్రవారం వరకూ ఫిజియోథెరపీ శిక్షణ ఇస్తున్నారు. శనివారం ఇంటివద్దనే విద్యను నేర్చుకునేలా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మంద బుద్ధి, దృష్టి, వినికిడి లోపాలు కలిగిన చిన్నారులకు స్పీచ్ థెరపీ, బ్రెయిలీ శిక్షణ, జీవిత అందిపుచ్చుకునేలా ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నారు. ప్రతి గురువారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నారు. అడుగు తీసి అడుగు ముందుకు వేయలేని చిన్నారులందరికీ నడక నేర్పించడం తమ కాళ్లపై తాము నిలుచునేలా శిక్షణ ఇస్తున్నారు. ఐఈఆర్‌పీలు(ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్‌లు) చిన్నారుల ఇంటి వద్దకే వెళ్లి ఫిజియోథెరపీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మాటలు రానివారికి స్పీచ్‌థెరపీ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి మాట్లేడాలా చేస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లితండ్రులు ఎంతగానో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీలు

ప్రభుత్వం భవిత కేంద్రానికి వచ్చే విభిన్న ప్రతిభావంతులకు రవాణ ఖర్చులు నిమిత్తం ప్రతి నెలా రూ.300 అందిస్తోంది. వారికి భద్రతగా వచ్చే తల్లిదండ్రులకు రూ.250 చొప్పున రాయితీ అందిస్తోంది. వారికి మధ్యాహ్న భోజనం, దుస్తులు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు వంటి పలు ఉపకరణాలు ప్రభుత్వం సమకూరుస్తోంది. అవసరమైన చిన్నారలకు శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు.



రౌతులపూడి భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కొంత నయమైంది



మా అబ్బాయి పుట్టుకతోనే చెవుడు, మూగ. భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేయించాం. స్పీచ్, వినికిడి యంత్రాల ద్వారా శిక్షణ ఇచ్చారు. అలా చేయించడం వల్ల చాలా వరకు మెరుగుపడింది. గత మూడేళ్ల నుంచి ఈ సేవలు వినియోగించకుంటున్నాం. గుమ్మరేగుల నుంచి రౌతులపూడికి బాబుని ప్రతిరోజు తీసుకెళుతున్నాం. ప్రస్తుతం మా బాబును రౌతులపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాం.

– బత్తుల రామకృష్ణ, గుమ్మరేగుల

దివ్యాంగుల్లో మార్పే లక్ష్యం



విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల్లో ప్రత్యేక మార్పు తీసుకురావటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తోటి సాధారణ విద్యార్థుల్లా వారు కూడా ఉండాలని శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలల్లో చేరిన విద్యార్థులు మానసిక స్థితిని అంచనా వేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వారి పనులు వారు చేసుకునేలా దివ్యాంగులను తయారు చేస్తున్నాం. ఈ ఏడాది నలుగురు చిన్నారులను ఉన్నత పాఠశాలలో చేర్పించాం. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఈ చికిత్సను అందించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలి.

– శ్రీనివాస్, ఐఈఆర్‌టీ, రౌతులపూడి

జగనన్న సురక్షతో ఆరోగ్య భద్రత



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ గంగబాబు

తుని రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య భద్రత లభించిందని కేఓ మల్లవరం సర్పంచ్ డొంక సత్యవతి అన్నారు. మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గ్రామంలో ఆమె ప్రారంభించారు. ఎస్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ పర్యవేక్షణలో నిపుణులైన డాక్టర్లు వైద్యసేవలు అందించారు. 243 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్టు పేర్కొన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రతి మంగళవారం ప్రత్యేక శిబిరాలు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు డొంక వెంకటబెనర్జీ, కార్యదర్శులు వై.వీరబాబు, పైలా శివ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష

తొండంగి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి రక్ష అని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, సర్పంచ్ సోమాల ప్రసాద్, పార్టీ నాయకుడు దడాల విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన వృద్ధులకు పలు వైద్యపరీక్షలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత కూడా శిబిరాన్ని సందర్శించి సేవలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పసుపులేటి సతీష్, పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శిరీష, వి.యు వకిషోర్, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, పార్టీనాయకులు పారేపల్లి సురేష్, పంచాయతీ కార్యదర్శి చోడిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి పుష్పాలంకరణ



పుష్పార్చనలో రామలింగేశ్వరస్వామి

గండేపల్లి: తాళ్లూరులో రామలింగేశ్వర స్వామి వారికి మంగళవారం బిల్వాపత్రి, శమీపత్రి, చామంతి పూలతో పుష్పార్చన చేశారు. ప్రజలు పాడిపంటలతో అభివృద్ధిగా ఉండాలని అర్చక స్వామి వివిఎస్ఎన్ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

గండేపల్లి: మురారి కనకదుర్గమ్మను మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వాహనాలపై కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకుని అక్కడే వంట వార్పుచేసుకుని అమ్మవారికి నివేదించి అనంతరం ప్రసాదాలు స్వీకరించి సాయంత్రం వరకు అక్కడే గడిపారు.

పట్టణాభివృద్ధికి వడివడిగా అడుగులు



తుని పట్టణంలో సీసీ రోడ్డు పనులకు కొబ్బరి కాయ కొడుతున్న సీపీ సుధారాణి, నాయకులు

తుని: పట్టణంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని 5, 6 వార్డులకు సంబంధించి గొట్టుముక్కలవారి వీధిలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ఆమె ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని సీపీ సుధారాణి అన్నారు. గత ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు మర్రా సత్యవతి, సూరిశెట్టి సుభద్రాదేవి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



ఒకటో వార్డులో పార్టీ జెండా ఎగుర వేస్తున్న సీపీ సుధారాణి, నాయకులు

తుని: ప్రజలకు ఏమి కావాలో తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలుసని, రాష్ట్ర ప్రగతి కోసం ఆయన చేస్తున్న కృషి ఎనలేనిదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం సాయంత్రం ఒకటో వార్డు కొండవారిపేట సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు నక్కా జాన్ ఆనంద్, పట్టణ యువత అధ్యక్షుడు గొల్లపూడి బుచ్చిరాజు, కౌన్సిలర్లు వరాది జ్యోతి, చింతల సునీత, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న బుగత శివ

ప్రత్తిపాడు: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 2022 చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ డిమాండ్ చేశారు. చినశంకర్లపూడి గ్రామంలోని సగర్ల రామాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం రైతు సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో బుగత శివ మాట్లాడుతూ ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలు న్యాయానికి దూరమవుతారన్నారు. ఈ చట్టం రద్దు కోసం రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా ఈ చట్టం రద్దుకు సహకరించాలని బుగత శివ కోరారు. ఈ సదస్సులో నియోజకవర్గ బీసీ ఐక్య సంఘటన కార్యదర్శి ఏపూరి శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి, ఐలాజ్ రాష్ట్ర కమిటి సభ్యురాలు అవసరాల దేవి, ఏపూరి రాంబాబు, చనుబోయిన బుజ్జి, నాగేశ్వరరావు, గణేశుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



సాయిని అభినందిస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు రూరల్: రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న ధర్మవరం హైస్కూల్ విద్యార్థిని జి.సాయిని ఎంఈఓ వి.రాజబాబు అభినందించారు. ఎంఈఓ వి.రాజబాబు మాట్లాడుతూ 2023–24కు సంబంధించి కడప జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో జి.సాయి రూపొందించిన రిమోట్ కంట్రోల్ అగ్రికల్చర్ మిషన్‌కు ప్రథమ బహుమతి లభించిందన్నారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఆకుల శివకుమార్ వ్యవహరించారని తెలిపారు. ప్రథమ బహుమతి గెలుపొందిన సాయిని ధర్మవరం హై స్కూల్‌లో సీఆర్పీలు రాంజీ, గంగాధర్, ఉపాధ్యాయులు ప్రధాన ఉపాధ్యాయులు కె.చంద్రమూర్తి, ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, కె.రాజు, ఉమామహేశ్వరరావు, ఆర్.సూర్యనారాయణ, జాన్నీ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య వాసి సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్రికుడు దినకర్‌దాస్

తొండంగి: సనాతన సంస్కృతి, పర్యావరణాన్ని పరిరక్షించాలని సంకల్పంతో, అవగాహన కలిస్తూ దేశ వ్యాప్తంగా సైకిల్‌పై పిన్న వయస్సులో యాత్ర సాగిస్తున్నాడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యకు చెందిన దినకర్ దాస్. ఈ సైకిల్ యాత్ర మంగళవారం తొండంగి మండలం, బెండపూడి చేరింది. ఈ సందర్భంగా బెండపూడి జాతీయ రహదారి వద్ద దినకర్‌దాస్ సాక్షితో ముచ్చటించారు. 2023లో జనవరి 12 స్వామివివేకానంద జన్మదినం రోజున అయోధ్యలో తన సైకిల్ యాత్ర ప్రారంభించాడు. మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్నాటక్, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరీ రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర సాగింది. ఇప్పటి వరకూ 15 వేల కిలోమీటర్లు సైకిల్‌పై యాత్ర పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు.

ఘనంగా పాళమ్మతల్లి ఆలయ నిర్మాణం



పెనుగుదురు గ్రామ దేవత పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య, సర్పంచ్ వెంకటమాధవి, రమేష్ దంపతులు

- రూ.35 లక్షలతో చురుగ్గా పనులు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. మండలంలోని పెనుగుదురు గ్రామదేవత పాళమ్మతల్లి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఆలయాల పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేశారన్నారు. పాళమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేశామన్నారు. సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు బందారు సుజాత, వెంకటేశ్వరరావు, ఆలయ ఉత్సవ కమిటీ ఆలయాన్ని చక్కగా నిర్మించారన్నారు.

4న విగ్రహ ప్రతిష్ఠ

పునర్నిర్మించిన ఆలయంలో గురువారం జరిగే పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు ముందస్తు పూజలు మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య తదితర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప మార్కెట్ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచరావు, బందారు సతీష్, దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



టీ షర్ట్స్, కేప్‌లను కార్యదర్శులకు అందజేస్తున్న ఎంపీపీ

గండేపల్లి: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఐదు రకాల క్రీడల్లో గ్రామస్థాయిలో పాల్గొని మండల స్థాయి పోటీల్లో స్థానం దక్కించుకున్న క్రీడాకారులకు టీ షర్ట్స్, కేప్‌లను మంగళవారం ఆయన చేతుల మీదుగా ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేసి క్రీడాకారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామన్, ఈఓపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు సూర్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుకు ప్రత్యేక కార్యాచరణ



జగన్నాథపురంలో పన్ను వసూలు చేస్తున్న అధికారులు

కోటనందూరు: మండలంలో ఇంటిపన్ను వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని పంచాయతీ విస్తరణాధికారి జీ అరుణ్‌కుమార్ తెలిపారు. జగన్నాథపురంలో జరుగుతున్న ఇంటిపన్ను వసూలును మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామస్తులకు డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ లావాదీవీలను ప్రోత్సహిస్తోందని, పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే మార్చి నాటికి కొత్త, పాత ఇంటి పన్ను బకాయిలను వసూలు చేయాలని నిర్దేశించామన్నారు. ఇంటిపన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చామన్నారు. బకాయిదారులు పన్నులు చెల్లించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శి వరహాలు, గుమస్తా సురేష్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న విజయదుర్గ

శంఖవరం: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మంగళవారం జి.కొత్తపల్లి హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు ఉపయోగించుకుని సాంకేతికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు, ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏలేరులో 79.05 మీటర్ల నీటినిల్వలు



ఏలేరులో ఉన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో నీటినిల్వలు నిలకడగా ఉన్నాయి. మంగళవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 79.05 మీటర్లు, 24.11 టీఎంసీలకు 12.37 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇటీవల మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో నీటినిల్వలు పెరిగాయి. దీంతో దిగువ ఆయకట్టుకు 400, విశాఖకు 150 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజుచెరువుకు నీటిని నిలిపివేశారు.

తోట నరసింహంకు అభినందనలు



వీరవరంలో తోట నరసింహంకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

కిర్లంపూడి: మాజీ మంత్రి తోట నరసింహంకు పలువురు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌ఛార్జిగా తోట నరసింహంను మంగళవారం రాత్రి ప్రకటించడంతో అభిమానులు వీరవరంలోని ఆయన స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో తోట బాబ్జి, ఓలేటి రాజు, తోట అయ్యన్న, అడబాల సుబ్బారాయుడు, బేరి బాబ్జి పలువురు ఉన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జె.కొత్తూరుకు చెందిన కేసుబోయిన వీర్రాజు పది లీటర్ల సారాను తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో గ్రామ శివారులో అతనిని అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

గండేపల్లి: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు సూరంపాలెంకు చెందిన లావేటి సత్యనారాయణ గ్రామ శివారులో సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి జరిపి అతనిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించినట్టు తెలియజేశారు.

మానసిక శక్తిని వృద్ధి చేసుకోవాలి

కాకినాడ రూరల్: చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక ఒత్తిళ్లు నెలకొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ప్రశాంతత వృద్ధి చేసుకోవాలని ఓం శాంతి ఆశ్రమాల ప్రతినిధి రజనీ దీదీ పేర్కొన్నారు. స్థానిక శాంతి వనంలో శ్రీ విద్య కాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.